ఆఖరి మజిలీకి కష్టాలు

- ధర్మవరం పట్టణంలో 1.50 లక్షల జనాభా
- సరిపోని హిందూ శ్మశానవాటిక
- పూడ్చిన చోటే మళ్లీ మృతదేహాలకు అంత్యక్రియలు
- మురికి కూపంగా మారిన శ్మశానవాటిక



చెత్తాచెదారంతో నిండిన హిందూ శ్మశానవాటిక



సమాధుల మధ్య నిలిచిన వర్షపు నీరు

ధర్మవరం అర్బన్: పట్టణంలో అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి ఇబ్బందిగా మారింది. మృతదేహాలను పాతిపెట్టిన చోటే మళ్లీ తవ్వి శవాన్ని పూడ్చుకోవాల్సిన దుర్భర పరిస్థితి ఎదురవుతోంది. ధర్మవరం పట్టణంలో హిందూ శ్మశాన వాటిక స్థలం కొరత ప్రజలను ఇక్కట్లకు గురి చేస్తోంది. పట్టణంలో దాదాపు 1.50 లక్షల జనాభా ఉండగా అందులో ముస్లింలు, క్రిస్టియన్లు పోగా మిగిలిన వారందరికి ఒకే ఒక హిందూ శ్మశాన వాటిక ఉంది. గాంధీనగర్ నుంచి కదిరిగేట్‌కు వెళ్లే దారి పక్కన దాదాపు 15 ఎకరాల్లో హిందూ శ్మశాన వాటిక ఉంది. శతాబ్దాల క్రితం పట్టణం ఏర్పడినప్పుడు కేటాయించిన శ్మశాన వాటిక స్థలంలోనే ప్రస్తుతం మృతదేహాలను పూడుస్తున్నారు. హిందువుల సాంప్రదాయం ప్రకారం మృతదేహాలను పూడ్చి పెట్టాలి. స్థలం కొరత తీవ్రంగా ఉన్న కారణంగా ముందుగా స్మశానవాటికకు మృతుడి బంధువులు వెళ్లి తమ వారిని పూడ్చడానికి స్థలం వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్తగా స్థలం లభించే పరిస్థితి లేకపోవడంతో మృతదేహాలను ఖననం చేసిన చోటే మళ్లీ గుంతలు తీసి పూడ్చుకుంటున్నారు. చాలా ఏళ్లుగా హిందువులను ఈ సమస్య పట్టిపీడిస్తోంది. ప్రతి సంవత్సరం దసరా పండుగకు ముందు జరిగే పెద్దల పండుగకు తమవారి సమాధుల వద్దకు వచ్చి హిందువులు చాలా అసహనానికి గురవుతున్నారు. చాలామార్లు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. పట్టణ పరిధిలో ఉన్న స్థలాలు విలువైనవి కావడంతో అధికారులు ఈ సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. ప్రస్తుతం పట్టణ జనాభాకు అనుగుణంగా దాదాపు 25 ఎకరాల స్థలం అవసరం. శ్మశానవాటిక చుట్టూ ఉన్న ప్రహరీ శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికే పలుచోట్ల ప్రహరీ కూలిపోయింది. శ్మశానవాటికలో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మృతదేహాలను ఖననం చేసేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దుర్వాసన వస్తోంది..

పట్టణంలోని గ్యాస్ గోడౌన్ ఏరియా, శాంతినగర్ తదితర వార్డుల్లోని మురుగు నీరు హిందూ శ్మశాన వాటికలోకి చేరుతోంది. దీంతో సమాధుల మధ్య మురుగు నీరు నిల్వ ఉండటంతో సమాధులన్నీ కుంగిపోయి కూలిపోతున్నాయి. చాలా సమాధులు ఇప్పటికే శిథిలావస్థకు చేరుకున్నాయి. మురుగు చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. తమ పెద్దలకు పండుగ పూట పూజలు చేసుకోవాలంటే చాలా కష్టంగా ఉందని పట్టణవాసులు చెబుతున్నారు.

అధికారులకు విన్నవించాం



ప్రస్తుతం ఉన్న జనాభాకు శ్మశానవాటిక స్థలం సరిపోవడం లేదు. చాలామంది ఉన్న సమాధులను తవ్వేసి కొత్తగా మృతదేహాలను ఖననం చేస్తున్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగా 25 ఎకరాలు స్థలం అవసరం. ఈ సమస్యను మంత్రి సత్యకుమార్ యాదవ్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్థలాన్ని కేటాయించకపోతే హిందువుల మృతదేహాలను ఖననం చేసేందుకు ఉన్న సమాధులన్నింటినీ తొలగించాల్సి వస్తుంది. స్థలాన్ని కేటాయించి హిందువులకు న్యాయం చేయండి.

– వెంకటేష్, మున్సిపల్ ఉద్యోగి, శ్మశానవాటిక ఇన్‌చార్జ్, ధర్మవరం

వేధిస్తున్న స్థలం కొరత



శ్మశాన వాటికలో స్థలం లేకపోవడంతో ఇతరులు మృతదేహాలను పూడ్చినచోటే మళ్లీ పూడ్చుకుంటున్నారు. శ్మశాన వాటికలో పూజలు చేయని శిథిలావస్థకు చేరుకున్న సమాధులను తవ్వి అక్కడ కొత్తగా శవాలను పూడ్చాల్సి వస్తోంది. మృతదేహాన్ని పూడ్చేందుకు కూడా స్థలాన్ని వెతుక్కోవాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించి పుణ్యం కట్టుకోండి.

– రాము, ధర్మవరం

క్లుప్తంగా

బెస్ట్ యూనివర్సిటీలో బ్యాంక్ బరోడా శాఖ ప్రారంభం



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న అధికారులు, బెస్ట్ యూనివర్సిటీ యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: గోరంట్ల మండలం కమ్మలవాండ్లపల్లిలోని బెస్ట్ యూనివర్సిటీలో బ్యాంక్ బరోడా 59వ శాఖ (తిరుపతి రీజియన్‌లో) ను ప్రారంభించారు. సుమారు 20 గ్రామాలకు తమ సేవలను విస్తరించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఏజీఎం అమరనాథ్‌రెడ్డి, బెస్ట్ యూనివర్సిటీ ఛాన్సలర్ రూపా వాసుదేవన్, చైర్మన్ భరత లాల్‌మీనా, వైస్ ఛాన్సిలర్ అనూరాధ ధర్ పేర్కొన్నారు. తమ శాఖలను విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బ్యాంకు ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక చేయూత అందిస్తామన్నారు. మారుమూల ప్రాంతాల ఖాతాదారులకు సౌకర్యవంతమైన బ్యాంకింగ్ సేవలను అందించడానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్లు రాంబాబు, గౌతమ్, విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల నిరసన

కదిరి అర్బన్: పాలసీదారులకు బోనస్ పెంచి తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట మధ్యాహ్నం 1గంట నుంచి 2 గంటల వరకు పలువురు ఏజెంట్లు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమకు పాత కమీషన్‌ను పునరుద్ధరించాలన్నారు. అలాగే బోనస్ రేట్లు పెంచాలన్నారు. క్లాబ్యాక్ కమిషన్ సిస్టంను ఖండిస్తున్నామన్నారు. రూ.లక్ష పాలసీని పునరుద్ధరించాలన్నారు. సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 28 వరకూ నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో లియాఫీ నాయకులు రమణారెడ్డి, వెంకటేష్‌బాబు, రాజారెడ్డి, నారాయణరెడ్డి, కోటేశ్వరయ్య, లోకేశ్వరరెడ్డి, ఏజెంట్లు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

ఎన్పీకుంట: మండలంలోని టి.ఎస్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వి.శిరీష (9వ తరగతి) జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మురళీక్రిష్ణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు శిరీషను అభినందించారు. వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత రాణించి జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయిని సుహాసిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 23 మంది ఎంపిక

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 53 మంది అభ్యర్థులు హాజరుగా రెండు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసి.. అందులో 23 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, అధ్యాపకులు హైదర్ అలి, కో ఆర్డినేటర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

తలుపుల: మండల కేంద్రం ఎగువపేట సమీపంలోని ఏటిగంగమ్మ గుడి మాన్యం భూమి ఆవరణలో సోమవారం అర్చకుడు లక్ష్మీనరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బురుజుపల్లికి చెందిన ఓరం సూర్యనారాయణరెడ్డి, హేమావతి దంపతులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సుమారు 3 లక్షలు వెచ్చించి నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. భక్తులు హాజరై పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

అధికారుల గైర్హాజరు



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

గాండ్లపెంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక సంఖ్యలో అధికారులు డుమ్మా కొట్టారు. ఈ పరిస్థితి దాదాపు గత మూడు వారాలుగా కొనసాగుతోంది. పరిష్కార వేదిక కార్యక్రమానికి 25 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా.. కేవలం ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ బాబూరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మావతమ్మ, మండల పరిషత్ కార్యాలయం సీనియర్ సహాయకుడు అమీర్ బాషా హాజరయ్యారు. మిగిలిన 22 శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ ఇళ్లకు వెళ్లారు. కాగా ఉదయం 11 గంటలైనా ముగ్గురు మినహా ఇతర శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో సాక్షి తహసీల్దార్‌ను వివరణ కోరగా కార్యక్రమానికి అధికారులు అందరూ హాజరుకావాల్సి ఉందన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించరా?



వేదికపై ఎంపీపీ, అధికారులతో పాటు కూర్చున్న మండల టీడీపీ నాయకులు

కనగానపల్లి: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులు ప్రొటోకాల్ మరిచిపోయి నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నారని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ ఆగ్రహం వెలిబుచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దగా హాజరుకాకపోయినా అనధికార టీడీపీ ప్రజాప్రతినిధులు మాత్రం ఎక్కువ మంది వచ్చారు. మొదట శాఖల వారీగా అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నారన్నారు. మండల, గ్రామ స్థాయిలో జరిగే అధికారిక సమావేశాలకు స్థానిక ప్రజాప్రతినిధులను అధికారులు ఆహ్వానించడం లేదన్నారు. అనధికార ప్రజాప్రతినిధులుగా పనిచేస్తున్న టీడీపీ నాయకులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. ఇదే విధంగా స్థానిక అధికారులు ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రభుత్వ అధికారులు డుమ్మా.. టీడీపీ నాయకులకు స్థానం

ప్రజా సమస్యలపై చర్చించటానికి ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. ముఖ్యమైన రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్‌శాఖ అధికారులతో పాటు ఆర్‌అండ్‌బీ, అటవీశాఖ అధికారులు సమావేశానికి హాజరు కాలేదు, దీంతో సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించేదుకే వీలు లేకుండా పోయింది. అయితే ఈ సమావేశానికి పలువురు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశంలోకి వచ్చి కుర్చుని తమ అధికార దర్పాన్ని ప్రదర్శించారు. చివరకు సమావేశం వేదికపైనే టీడీపీ మండల కన్వీనర్ పోతలయ్య, నాయకుడు నెట్టం వెంకటేష్ కుర్చుని అధికారులు, ప్రజాప్రతినిధులకు సలహాలు ఇవ్వటాన్ని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తప్పుపట్టారు. దీనిపై ఎంపీడీఓ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా సర్వసభ్య సమావేశానికి అనధికార ప్రజాప్రతినిధులు రావడం పెద్ద తప్పు కాదన్నట్లు సమాధానం ఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, ఎంఈఓ అరుణమ్మ, వైద్యాధికారి చెన్నారెడ్డి, ఏపీఎం హేమలత, ఏపీఓ వెంకటేష్ నాయక్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలుంటే అర్జీలు ఇవ్వండి



అప్పరాచెరువు గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ స్వర్ణలత

బత్తలపల్లి/తలుపుల/గాండ్లపెంట/కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: భూముల రీ సర్వేలో నెలకొన్న సమస్యలపై అర్జీలు ఇవ్వాలని అధికారులు సూచించారు. సోమవారం బత్తలపల్లి, తలుపుల, గాండ్లపెంట, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి తదితర మండలాల్లో సోమవారం భూ రీసర్వేపై రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. రీ సర్వే జరిగిన సమయంలో ఏమైనా తప్పులు జరిగి ఉంటే అర్జీలు అందజేయాలని సూచించారు. త్వరితగతిన భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్లు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా మహేశ్వర రెడ్డి

అమడగూరు: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా మహేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న వెంకటరెడ్డి డీఎస్‌ఓ ఆఫీసుకు బదిలీ అయ్యారు.

మారాల రిజర్వాయర్‌కు హంద్రీనీవా నీటి విడుదల

పుట్టపర్తి: ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో కరువు నేల అయిన పుట్టపర్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. సోమవారం ఆమె మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి బుక్కపట్నం మండలం మారాల రిజర్వాయర్‌కు హంద్రీ–నీవా కాలువ నుంచి నీరు విడుదల చేశారు. మారాల రిజర్వాయర్ 0.48 టీఎంసీలు నీటి సామర్థ్యం కలిగి ఉందని, డ్యాంను పూర్తిగా నింపుతామన్నారు. అంతకుమందు ఎమ్మెల్యే సింధూరారెడ్డి గంగ పూజ చేశారు.

ఘనంగా బాలికా దినోత్సవం

ముదిగుబ్బ: మలకవేమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికల హక్కులు, వివక్షత, సమానత్వం అభివృద్ధి, అక్రమ రవాణా, బాలికలకు ఎదురవుతున్న సమస్యలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, బత్తలపల్లి రీజినల్ డైరెక్టర్ ప్రమీల, ఎంఈఓ రమణప్ప, ఏటీఎల్ కృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు ఎస్తేరు రాణి, ఆర్డీటీ సిబ్బంది శ్రీరాములు, రమణప్ప, పర్వీన్, సాయి ప్రకాష్ పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



ఎన్పీకుంట: మాట్లాడుతున్న ఎస్‌ఐ వలిబాషా



ముదిగుబ్బలో పోలీసుల ర్యాలీ..



చెన్నేకొత్తపల్లి: సుధాకర్‌రెడ్డి విగ్రహానికి నివాళి

తనకల్లు/ఎన్పీకుంట/ధర్మవరం అర్బన్/చెన్నేకొత్తపల్లి/ముదిగుబ్బ/రామగిరి/నల్లచెరువు: ధర్మవరం, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. పలు పోలీస్‌స్టేషన్లలో విధి నిర్వహణలో అమరులైన పోలీసుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి



జిల్లా కలెక్టర్ చేతన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం జిల్లా నాయకులు

బత్తలపల్లి: తుపాను ప్రభావంతో శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల్లో అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు సాగు చేసిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆర్థికంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ చేతన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పంటలు కుళ్లిపోయి ఎందుకు పనికి రాకుండా పోయాయన్నారు. వేరుశనగ, కంది, మిరప, టమాట, ఆముదం, బొప్పాయి తదితర పంటలు సాగు చేసిన రైతులకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. జిల్లా అధికారులు పంటలను పరిశీలించాలని కోరారు. సమగ్ర సర్వే చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. పిడుగుపాటుతో గొర్రెలు, మేకలు, ఆవులు, రైతులు చనిపోయారని తెలిపారు. పిడుగుపాటుకు చనిపోయిన ఒక్కో రైతుకి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అడపాల వేమనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహాదేవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అగ్గి రామ్మోహన్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతూరులో సోమవారం ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బుక్కపట్నం మండలం యాదలంకపల్లి గ్రామానికి చెందిన గొల్ల చంద్రాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన అతడిని చికిత్స నిమిత్తం బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు

ప్రశాంతి నిలయం: బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. 2022 మార్చి 26 ధర్మవరం నుంచి పెళ్లివేడుకకు వెళ్తూ బాకారపేట ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 మంది మృతి చెందగా , 41 మంది గాయపడ్డారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం తక్షణ ఆర్థికసాయం అందజేసింది. కలెక్టర్ చొరవతో ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షలు , క్షతగాత్రులకు రూ.50 వేల వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడి మృతి

ధర్మవరం: పట్టణానికి చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు గంటపార రంగనాయకులు అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సోమవారం మృతి చెందాడు. ఈయన గతంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేశాశారు. గంటపార రంగనాయకులు మృతిపై పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

కేబుల్ చోరీ

బత్తలపల్లి: మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో బోరు బావులకు అమర్చిన కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దాదాపు 100 మీటర్ల కేబుల్ సుమారు రూ.15 వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. ఈ విషయమై బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామానికి

సంక్షిప్త సమాచారం

చెందిన చిత్రా నాగభూషణ, చిత్రా ఓబులేసు, చిత్రా చిన్న ఓబులేసు, బోడిమల్ల సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

నట్టల నివారణకు టీకాలు వేయించాలి

బత్తలపల్లి: వర్షాకాలంలో జీవాలకు నట్టల వ్యాధులు వ్యాప్తి చెందకుండా టీకాలు వేయించుకోవాలని బత్తలపల్లి ప్రాంతీయ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి రైతులకు సూచించారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. గొర్రెలు, మేకలకు మండల వ్యాప్తంగా ప్రభుత్వం ద్వారా ఉచితంగా నట్టల నివారణ మందులు తాపిస్తున్నట్లు వివరించారు. పశువైద్య సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా గొర్రెలు మందల దగ్గరకే వెళ్లి జీవాలన్నింటికి డీవార్మింగ్ మందులు తాపిస్తున్నట్లు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

తనకల్లు: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ కదిరి ఏడీఏ సత్యనారాయణ సూచించారు. మండలంలోని బొంతలపల్లిలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించిన రైతులను ఎంపిక చేసి, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. రైతులు పండించిన పంటను బెంగళూరులోని ల్యాబ్‌కు ఏపీఎస్‌ఓపీసీఏ ద్వారా పంపుతామన్నారు. సీఈఓ హనుమంతు, వ్యవసాయ అధికారులు శ్రీహరి నాయక్, లక్ష్మి ప్రియ రైతులు పాల్గొన్నారు.

సన్మానం..

కదిరి అర్బన్: కదిరి డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తూ జూన్‌లో పదవీ విరమణ పొందిన హరిమోహన్‌ను సోమవారం విజయవాడలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. కదిరి డిపోలో ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో హరిమోహన్ ప్రత్యేక చొరవ చూపించేవారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావ్ అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు రమణ, బైరిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగి



ప్రయాణికుడికి పర్సు అందజేస్తున్న డ్రైవర్ రమేష్‌నాయుడు

కదిరి అర్బన్: బస్సులో పోగొట్టుకున్న పర్సును ప్రయాణికునికి అందజేసి ఆర్టీసీ డ్రైవర్ రమేష్ నాయుడు నిజాయతీని చాటుకున్నారు. వివరాలు.. ఆదివారం రాత్రి కదిరి నుంచి విజయవాడకు వెళ్తున్న ప్రయాణికుడు జేసయ్య బస్సులో పర్సును పొగొట్టుకున్నాడు. ఇంటికి వెళ్లాక పర్సు కనిపించకపోవడంతో వెంటనే డ్రైవర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. బస్సులో సీటుకింద పడి ఉన్న పర్సును డ్రైవర్ తీసుకుని ప్రయాణికుడికి అప్పగించారు. అందులో నగదు రూ.9 వేలదాకా ఉంది. డ్రైవర్ నిజాయితీని అందరూ మెచ్చుకున్నారు.

మద్దతు ధరతో కొనుగోలు చేయాలి

ప్రశాంతి నిలయం: ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన వేరుశనగ కాయలను కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని జిల్లా రైతు పరస్పర సహకార పరిమిత సమాఖ్య సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ చేతన్‌కు వినతిపత్రం అందజేశారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మొన్నటి దాకా రూ.8 వేలు క్వింటాల్ ఉన్న వేరుశనగ ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయిందన్నారు. జిల్లా రైతులు ఆదోని, చెళ్లకెర, కర్నూల్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటే రూ.3,300 మాత్రమే చెల్లిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు.

అంధకారంలో వీధులు



కాలిపోయిన మెయిన్ స్విచ్

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వీధిదీపాలు వెలగక పోవడంతో అంధకారం అలుముకుంది. యల్లమ్మ ఆలయం వీధి, కొత్తబజారు, బ్యాంక్‌బజారు, ట్యాంక్ బజారులో సుమారు 15 రోజుల నుంచి వీధిదీపాలతో పాటు సోలార్ లైట్లు కూడా వెలగడం లేదని ఆయా వీధిప్రజలు వాపోయారు. వీధిదీపాలకు సంబంధించి మెయిన్‌స్విచ్ కాలి పోవడంతో సమస్య తలెత్తిందని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున.. రాత్రి పూట బయటికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మెయిన్ స్విచ్ మరమ్మతు చేయించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సొంతింటి నిర్మాణానికే ఉచిత ఇసుక

ధర్మవరం అర్బన్: సొంతింటి నిర్మాణానికి మాత్రమే ఉచితంగా ఇసుక అందిస్తున్నామని ఆర్డీఓ మహేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎద్దులబండ్లతో పాటు ట్రాక్టర్లలో కూడా ఉచితంగా ఇసుకను సొంత ఇంటి నిర్మాణానికి తీసుకెళ్లవచ్చన్నారు. కానీ ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు ప్రభుత్వానికి సంబంధం లేదని ఇంటి నిర్మాణ యజమానులే భరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టేందుకే ఇసుకను వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా విక్రయించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతి ఇస్తున్నామన్నారు. టిప్పర్‌లో ఇసుక తరలించడానికి అనుమతి లేదన్నారు. తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో సీసీ రేవు, పీసీ రేవుల వద్ద నుంచి ఉచితంగా ఇసుకను పొందాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

ధర్మవరం: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆదిశేషు, సీఐటీయూ మండల కన్వీనర్ రమణ, కో–కన్వీనర్లు అయూబ్‌ఖాన్ కోరారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద ప్రభుత్వ పాఠశాలల శానిటరీ వర్కర్లతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. వర్కర్లకు పీఎస్, ఈఎస్‌ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో శానిటరి వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి నాగవేణి, సీఐటీయూ నాయకులు జంగమన్న, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రామగిరిలో ‘ప్రజా రెవెన్యూ దర్బార్’



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి: కొన్నేళ్లుగా రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా భూ సమస్యలు పరిష్కారం కాలేదని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ‘ప్రజా రెవెన్యూ దర్బార్’ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొందరు ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు మార్చి కబ్జా చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అసలు రైతు ప్రమేయం లేకుండా పొలాలు వేరే వారి పేర్ల మీద ఎలా వెళ్లాయని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. రామగిరి 42, నసనకోట 45, ఎంసి.పల్లి 28, పెద్దకొండాపురం 6, గంతిమర్రి 8, కుంటిమద్ది 8, పేరూరు 25, పోలేపల్లి 16 మొత్తం 178 వినతులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.